సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 19 । నవంబర్ । 2023



బాక్సింగ్ చాంపియన్.

శ్రీకాకుళం బాక్సింగ్ క్రీడాకారులు సత్తా చాటారు. వైజాగ్‌లో జరిగిన పోటీల్లో పతకాలు గెలిచారు.

-10లో



ప్రతిభకు నిదర్శనం

బాలల సైన్స్ కాంగ్రెస్‌లో పిల్లలు అదరగొట్టారు. ఏడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి.

-10లో

మిషన్ వాత్సల్య పథకానికి 683 మంది అర్హులు

శ్రీకాకుళం అర్బన్: మిషన్ వాత్సల్య పథకానికి జిల్లా నుంచి 683 మంది అర్హత సాధించారని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా పథక సంచాలకులు బి.శాంతిశ్రీ తెలిపారు. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 60:40 నిష్పత్తిలో నిధులు విడుదల చేస్తూ అమలు చేస్తున్నాయన్నారు. నెలకు రూ.4వేలు చొప్పున ఆర్థిక సహకారం అందజేస్తామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

తెప్పోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



తెప్పోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న పాలకమండలి సభ్యులు

అరసవల్లి: కార్తీక క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఈ నెల 24న ఆదిత్యుని హంసనావికోత్సవానికి (తెప్పోత్సవం) భారీగా భక్తులు వచ్చే అవకాశమున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆలయ పాలకమండలి సభ్యులు తెలియజేశారు. స్థానిక అనివేటి మండపంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల సమక్షంలో తెప్పోత్సవ ఆహ్వాన పత్రికలను శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుష్కరిణి పరిసరాలన్నీ ఆకర్షణీయంగా ఉండాలని, ఎక్కడా ఇబ్బందులు లేకుండా భక్తులకు స్వామి జలవిహార దర్శనం కలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పుష్కరిణిలో నీటి నిల్వ అధికంగా ఉన్న నేపథ్యంలో భక్తుల కు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా బారికేడ్లను చుట్టుపక్కల ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, ఎస్.కోటేశ్వరచౌదరి, ద్వారపు అనూరాధ, లుకలాపు గోవిందరావు, జలగడుగుల శ్రీనివాస్, దుక్క గనిరాజు, జోగి మల్లెమ్మ, మైలపల్లి లక్ష్మి, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

22న జాబ్, అప్రెంటిస్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 22వ తేదీన జాబ్‌మేళా, అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ రావు తెలిపారు. ఆ ప్రకటనలో శనివారం వివరాలు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు అభ్యర్థులు హాజరు కావాలని అన్నారు. మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) ఈ ఎంపికలు నిర్వహిస్తుందని అన్నారు. ఐటీఐ ట్రేడులు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానికల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఫిట్టర్‌లో 120, ఎలక్ట్రీషియన్‌లో 120, ఎలక్ట్రానిక్స్ మెకానికల్‌లో 50 అప్రెంటిస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. నైపుణ్యం బట్టి ఉద్యోగాల కల్పన ఉంటుందని చెప్పారు. స్టైఫండ్ రూ. 14,215, ఈఎస్ఈ సౌకర్యం, ఓటీ రెమ్యూమరేషన్ అందజేస్తారని వివరించారు. అభ్యర్థులు 25 ఏళ్ల లోపు వారై ఉండాలని, ఒరిజనల్, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని చెప్పారు.

తాడివలస విద్యార్థినికి రూ.50వేలు ఉపకార వేతనం



రూ. 50 వేలు చెక్కును అందుకుంటున్న విద్యార్థిని గురుగుబెల్లి ఢిల్లీశ్వరి

పొందూరు: మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థిని గురుగుబెల్లి ఢిల్లీశ్వరికి రూ.50 వేల ఉపకార వేతనానికి సంబంధించిన చెక్కును హెచ్ఎం బల్ల కంటయ్య శనివారం అందజేశారు. అమెరికాలోని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఆధ్వర్యంలో ఏడాదికి రూ. 25 వేలు చొప్పున రెండేళ్లకు రూ. 50 వేల చెక్కును పంపించారు. గతంలో ఢిల్లీశ్వరి స్వామి వివేకానంద స్ఫూర్తిదాయక ప్రసంగానికి మెచ్చుకొని ఈ ఉపకార వేతనాన్ని ప్రకటించారు. కరోనా సమయంలో ఢిల్లీశ్వరి తండ్రి మరణించిన విషయం తెలుసుకున్న తానా ప్రతినిధులు రామ్‌చౌదరి, సంజన ఉప్పలూరి, రేఖ ఉప్పలూరి తదితరులు ఢిల్లీశ్వరిని దత్తత తీసుకుని చదివించడంతో పాటు ఏటా రూ. 25 వేలను స్కాలర్‌షిప్ రూపంలో అందజేస్తూ వస్తున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూజారి హరిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్ ఫీవర్





శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో త్రివర్ణ పతాకాలతో భారత జట్టుకు బెస్ట్ విషెస్ తెలుపుతున్న ప్రిన్సిపాల్ సురేఖ, సిబ్బంది, విద్యార్థులు

- హై ఓల్టేజ్ క్రికెట్ మ్యాచ్ కోసం అభిమానుల ఎదురు చూపు
- ఎక్కడికక్కడ ప్రత్యేక స్క్రీన్‌ల ఏర్పాటు
- హోటల్స్, రెస్టారెంట్‌లలో లైవ్ ఏర్పాట్లతో పాటు ప్రత్యేక డిష్‌లు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాకు క్రికెట్ ఫీవర్ పట్టుకుంది. పన్నెండేళ్ల తర్వాత భారత జట్టు వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరడంతో ఆ మ్యాచ్ చూసేందుకు క్రికెట్ అభిమానులు కోటి కళ్లతో ఎదురు చూస్తున్నారు. భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌ను వీక్షించేందుకు జిల్లాలో భారీ ఏర్పాట్లు చేశారు. ఒకేచోట వేలాది మంది వీక్షించేలా ఎక్కడికక్కడ ప్రత్యేక స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. అభిమానులు ఎంజాయ్ చేసేందుకు డీజే, ఫుడ్ స్టాల్స్ వంటివి కూడా కొన్ని చోట్ల ఏర్పాటు చేయనున్నారు. హోటల్స్, రెస్టారెంట్‌లో కూడా ఎల్‌ఈడీ స్క్రీన్‌లతో పాటు ఆఫర్లతో కూడిన డిష్‌లను అందుబాటులోకి తెస్తున్నారు.

చరిత్ర సృష్టించేందుకు ఇండియా ఒక్క అడుగు దూరంలో ఉంది. ఇప్పటికే మన జట్టు అత్యంత బలంగా కనిపిస్తుండడం, వరల్డ్ కప్‌లో ఓటమి అనేదే లేకుండా ఫైనల్ వరకు జైత్రయాత్ర సాగించడంతో ఈ సారి కచ్చితంగా కప్పు కొడుతుందని అంతా భావిస్తున్నారు. అందుకే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, మంత్రి సీదిరి అప్పలరాజు, ధర్మాన కృష్ణచైతన్య, ఎక్కడికక్కడ యూత్ క్లబ్‌లు లైవ్ స్క్రీన్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు.

జిల్లాలో ఏర్పాట్లు ఇలా..

- శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు.
- నరసన్నపేట కళాశాల మైదానంలో ధర్మాన కృష్ణచైతన్య యూత్ ఆధ్వర్యంలో లైవ్ క్రికెట్ వీక్షించేందుకు ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేశారు.
- పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వైఎస్సార్ విగ్రహం వద్ద మంత్రి సీదిరి అప్పలరాజు భారీ స్క్రీన్ పెడుతున్నారు.
- కొత్తూరులో రెండు చోట్ల స్థానిక యువకులు ప్రత్యేక స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు.
- వజ్రపుకొత్తూరు మండలం పూండి బస్టాండ్ కూడలి వద్ద ప్రత్యేక స్క్రీన్ పెడుతున్నారు.
- హిరమండలం మండలంలోని సుబలయ ఆర్ అండ్‌ఆర్ కాలనీ యూపీ పాఠశాల ఆవరణలో ప్రత్యేక తెర ఏర్పాటు చేశారు.
- వీటితో పాటు అనేక గ్రామాల్లోనూ, మండల కేంద్రాల్లోనూ భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా క్రికెట్ సందడే నెలకొననుంది.



ఇచ్ఛాపురం రూరల్: 'ఆల్ ద బెస్ట్' ఆకృతిలో శుభాకాంక్షలు తెలుపుతున్న సత్యసాయి విద్యార్థులు

బెట్టింగ్ జోరు..



ప్రపంచ కప్ ఫైనల్ కావడం, అందులో ఇండియా ఫైనల్‌కు రావడం, ప్రత్యర్థిగా ఆస్ట్రేలియా పోటీ పడుతుండటంతో మ్యాచ్‌పై ఆసక్తి నెలకొంది. వయసుతో సంబంధం లేకుండా అందరూ ఇప్పటికే ప్రపంచ కప్ లీగ్, నాకౌట్ మ్యాచ్‌లను ఆస్వాదించారు. నేడు ఫైనల్ మ్యాచ్ జరుగుతుండటంతో టీవీలకు అతుక్కుపోనున్నారు. ఇదే సందర్భంలో బెట్టింగ్ జోరు కనబడుతోంది. బాల్ బాల్‌కి, ఓవర్‌కి, డ్రింక్స్ ముందు, డ్రింక్స్ తర్వాత, ఒక జట్టు బ్యాటింగ్ స్కోర్‌పై బెట్టింగ్ వేసేందుకు కొందరు తహతహలాడుతున్నారు. ప్రత్యేక యాప్‌ల ద్వారానే కాకుండా తెలిసిన వారితో నేరుగా బెట్టింగ్ కాసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

పెన్సిల్ ముల్లుపై క్రికెట్ వరల్డ్ కప్



నరసన్నపేట: టీమిండియా వరల్డ్ కప్ గెలవాలని కోరుకుంటూ స్థానిక సంతపేటకు చెందిన సూక్ష్మ చిత్ర కారుడు నర్సింహాచారి పెన్సిల్ నీడిల్‌పై 2 ఎంఎం పొడవుతో ప్రపంచకప్‌ను తయారు చేశారు. ఈ బొమ్మ అందరినీ ఆకట్టుకుంటోంది.



నరసన్నపేటలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్



శ్రీకాకుళంలోని ఓ రెస్టారెంట్‌లో ఏర్పాట్లు

కుల గణన సర్వేకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఈ నెల 27 నుంచి మొదలుకానున్న కుల గణన సర్వే సాఫీగా జరిగేలా అధికార యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు శనివారం సాయంత్రం శిక్షణ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. సర్వే కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో పొందుపరచిన పలు అంశాలు, వాటిని వినియోగించే పద్ధతులపై సుదీర్ఘ చర్చ జరిపారు. సర్వే సెక్షన్ ఏ, సెక్షన్ బి అనే రెండు దశల్లో జరుగుతుందన్నారు. ఎన్యూమరేటర్లుగా గ్రామ/ వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కులానికి సంబంధించిన సేకరించే సమాచార డేటాలో గోప్యత పాటించాలని, స్క్రీన్ షాట్‌లు తీయడం, స్క్రీన్ రికార్డింగ్‌లు చేయడం పూర్తిగా నిషేధం అనే సంగతి గుర్తించాలని స్పష్టం చేశారు. మండల స్థాయిలో జరిగే శిక్షణకు సచివాలయానికి ఇద్దరు చొప్పున ఉద్యోగులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. తర్వాత దశలో వీరు వారి సచివాలయంలోని మిగిలిన సిబ్బందికి, వలంటీర్లకు శిక్షణ ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతి రావు, జిల్లా పరిషత్ సీఈఓ ఆర్. వెంకట్రామన్, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్ లక్ష్మీప్రసన్న, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనురాధ, మాస్టర్ ట్రైనీ వి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు మంచి విద్యను అందిద్దాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం రూరల్: పిల్లలకు ప్రపంచాన్ని చదివించగలిగే మంచి విద్యను అందించాలని, దీనివల్ల సమాజంలో వారికి మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. మండల పరిధిలోని కొత్తరోడ్ జంక్షన్ వద్ద గల ఓ కల్యాణ మండపంలో శనివారం ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం అధ్యక్షతన నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచ దేశాల్లో కంటే బాలల హక్కులను అమలు చేయడంలో ఏపీ ప్రభుత్వం ముందంజలోనే ఉందన్నారు. పాడుబడిన స్కూళ్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నాడు-నేడు పథకంతో బాగు చేసిందన్నారు. అమ్మ ఒడి నుంచి స్కూల్ బడి వరకూ మూడో తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్‌ను ఏర్పాటు చేయడం ఈ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. ఆడపిల్లలపై వివక్ష చూపించకూడదని, భ్రూణ హత్యలకు పాల్పడకూడదని దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలన, అక్రమ దత్తత నివారణ, బాలల అక్రమ రవాణా అరికట్టడంలో ఆయా సంస్థలు క్రియాశీల పాత్ర పోషించాలన్నారు. బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ దేశానికి విద్యార్థులే నిజమైన సంపద అని అన్నారు. విద్య, వైద్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు మంచి ఫలితాలు ఇచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్ రఘుపాత్రుని చిరంజీవి, అంతర్జాతీయ మానవ హక్కుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్, యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు రమణ కుమారి, విజయనగరం జేఎన్టీయూ పాలకమండలి సభ్యులు దుప్పల వెంకటరావు, జిల్లా వైద్య శాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షురాలు శ్రీలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఇక సొంతింటిలో ఉంటాం



జగనన్న కాలనీలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి వద్ద లిన్న మహంతి

మాకు సొంతిల్లు అని చెప్పుకోవడానికి ఏమీ లేదు. ఉపాధి కోసం ఒడిశా వెళ్లాం. అక్కడ చిన్న పూరి గుడిసెలో బతికాం. వెళ్లిన చోటల్లా ఇళ్లకు అద్దెలు కడుతూ ఇబ్బందులు పడేవాళ్లం. ఇలాంటి సమయంలో మా స్వగ్రామం మెళియాపుట్టిలోనే ప్రభుత్వం జగనన్న కాలనీలో స్థలం ఇచ్చి ఇల్లు కూడా మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం పూర్తి చేశాం. త్వరలోనే గృహ ప్రవేశం చేస్తాం. సొంతింటిలో నివాసం ఉంటామనే ఆలోచనే సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– లిన్న మహంతి, మెళియాపుట్టి గ్రామం



ఫేస్ యాప్ శుభ పరిణామం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఫేస్‌యాప్‌ను ప్రవేశ పెట్టడం శుభ పరిణామం. ఉపాధ్యాయులు సరైన సమయానికి పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు బోధన చేయాలన్న లక్ష్యం సరైనదే. అలాగే నాడు-నేడు పథకం ద్వారా సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. బడుల రూపురేఖలు మారడంతో ఉపాధ్యాయులు కూడా ఉత్సాహంగా వెళ్తున్నారు. గతంలో పాఠశాలలు అస్తవ్యస్తంగా ఉండేవి. ఇప్పుడు కార్పొరేట్ స్థాయిలో సర్కారు బడులు కనిపిస్తున్నాయి. విద్యార్థులకు అవసరమైన జగనన్న విద్యా కానుకలతో పేద పిల్లలు మరింత మంది బడి బాట పడుతున్నారు.

– బి.శంకరం, అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం, ఇచ్ఛాపురం మండలం

క్లుప్తంగా

ఆర్‌జీయూకేటీ కొత్త డైరెక్టర్‌కు స్వాగతం


కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీకి అభినందనలు తెలుపుతున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మూడేళ్ల టెర్మ్ పూర్తిచేసుకున్న డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది డైరెక్టర్‌కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ మోహన్‌కృష్ణ, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

'ఉపాధి' లక్ష్యాలు చేరుకోవాల్సిందే


మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో అన్ని మండలాల్లోనూ క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించి ఉపాధి వేతనదారులకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పని దినాలు కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు సిబ్బందిని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలోని వెలుగు కార్యాలయం సమావేశ మందిరంలో ఏపీవోలు, ఈసీలు, ఏపీడీలు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు రెండు వేల మంది కూలీలకు ఉపాధి కల్పించాలని ఆదేశాలు జారీ చేసినా ఎటువంటి ప్రగతి కనిపించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి టూర్ డైరీని జిల్లా కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. 100 రోజుల పని దినాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సామాజిక తనిఖీ రికవరీల బాధ్యత ఏపీవోలదేనని, 100 శాతం బకాయి వసూళ్లు ఈ నెలాఖరులోపు జరగాలన్నారు. జిల్లా హార్టికల్చర్ అధికారి ఆర్.జి.వి.ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి పథకంలో పామాయిల్ సాగును ప్రోత్సహించాలన్నారు. నాలుగేళ్ల పాటు మొక్కలు నిర్వహణ వ్యయాన్ని ఉచితంగా అందిస్తారని, ఐదో ఏట పంట దిగుబడి వస్తుందన్నారు. సమావేశంలో విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఏపీడీలు పి.రాధ, మురళీకృష్ణ, శైలజ, హెచ్ఆర్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, డీబీటీ మేనేజర్ విజయవాణి తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్, ట్యాలీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో 30 రోజుల టైలరింగ్, ట్యాలీ (కంప్యూటర్ అకౌంటింగ్) శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా యువకులు అర్హులని పేర్కొన్నారు. డిసెంబర్ 4 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఈలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య మహిళలు మాత్రమే అర్హులని చెప్పారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 7993340407, 9553410809 సంప్రదించాలని సూచించారు.

ప్రాజెక్టుల ప్రదర్శన.. ప్రతిభకు నిదర్శనం

- ఆలోచింపజేసిన 31వ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలు
- జిల్లా వ్యాప్తంగా 180 ప్రాజెక్టుల ప్రదర్శన
- రాష్ట్ర స్థాయికి ఎంపికైన 7 ప్రాజెక్టులు


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు

టెక్కలి: విద్యార్థుల విజ్ఞానం అబ్బురపరిచింది. ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థి వైజ్ఞానిక ఆలోచనలు కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. టెక్కలిలో శనివారం నిర్వహించిన 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా ప్రాజెక్టుల ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 160 పాఠశాలల నుంచి 180 ప్రాజెక్టుల వివరాలతో విద్యార్థులు హాజరయ్యారు. చివరగా 7 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉప విద్యాశాఖాధికారి కె.అప్పారావు నేతృత్వంలో ఆయన భార్య రామలక్ష్మి జ్ఞాపకార్థం విద్యార్థులకు మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి ఉప విద్యా శాఖాధికారి జి.పగడాలమ్మ, జిల్లా సైన్సు అధికారి ఎం.కుమారస్వామి, కె.తిరుమలచైతన్య, నిర్వాహక ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 29, 30 తేదీల్లో విజయవాడలో జరుగుతాయి.


ప్రాజెక్టు పేరు: హెల్తీ అండ్ న్యూట్రీషన్ వెల్ బీయింగ్ (సహజ సిద్ధమైన సేద్యం ద్వారా పోషకాల విలువలు)
తయారుచేసిన విద్యార్థులు: టి.చిన్నికృష్ణ, భగవాన్, బి.హేమంత్
గైడ్ టీచర్ : కె.దేవి, బి.పూర్ణిమ.
పాఠశాల పేరు: ఎంజేపీ ఏపీ బీసీడబ్ల్యూఆర్ఎస్, బాయ్స్, కోటబొమ్మాళి.

ప్రాజెక్టు పేరు: ఆర్గానిక్ ఫార్మింగ్ హోలిస్టిక్ అప్రోచ్ (ప్రకృతి ద్వారా లభించే జీవ, వృక్ష సంపద నుంచి ఎరువుల తయారీ)
తయారుచేసిన విద్యార్థులు: ఎ.రోహిత్ శ్రీసాయి, ప్రీతమ్
గైడ్ టీచర్ : బి.అప్పలరాజు.
పాఠశాల పేరు : ఏపీఎంఎస్, పాతపట్నం.




ప్రాజెక్టు పేరు : బయో రెమిడేషన్ ఆఫ్ హెల్దీ మెటల్స్ యూజింగ్ ఈస్ట్ సేవ్ ఎకో సిస్టమ్: (ఈస్ట్ కణాలతో నీటిని శుద్ధి చేయడం)
తయారుచేసిన విద్యార్థులు: డి.యుగంధర్, డి.రాకేష్
గైడ్ టీచర్ : జె.షణ్ముఖరావు.
పాఠశాల పేరు : జీహెచ్ఎస్, పలాస.


ప్రాజెక్టు పేరు : ఎకో ఫ్రెండ్లీ ఇన్‌స్టాన్స్ స్టిక్స్: (దేవాలయాల్లో వినియోగించిన వ్యర్థాలతో అగరొత్తుల తయారీ ప్రాజెక్టు)
తయారు చేసిన విద్యార్థులు: ఎస్.మాధవిలత, బి.సాయిలక్ష్మి, జె.కావ్య, ఎస్.దర్శిని, జి.మేఘన, బి.తేజేశ్వరి, ఎస్.నవ్య, ఎస్.నవ్య.
గైడ్ టీచర్ : కె.డేనియల్
పాఠశాల పేరు: జెడ్పీహెచ్ఎస్, సింగుపురం.

ప్రాజెక్టు పేరు : న్యూట్రిషన్స్ అండ్ బెనిఫిట్స్ ఆఫ్ బనానా స్టెమ్ (అరటి దవ్వతో పోషకాలు)
తయారుచేసిన విద్యార్థులు: పి.శైలజ, పి.శ్రావణి
గైడ్ టీచర్ : ఎస్.విజయదుర్గ
పాఠశాల పేరు : జెడ్పీహెచ్ఎస్, కోష్ట.



ప్రాజెక్టు పేరు : టాప్ సోయిల్ డిగ్రేడేషన్ డ్యూ టు బ్రిక్ ఇండస్ట్రీ రెమిడీస్ (నేల పొరను రక్షించే క్రమంలో ప్లాస్టిక్, ఇసుకతో ఇటుకల తయారీ)
తయారు చేసిన విద్యార్థులు: టి.మౌనిక
గైడ్ టీచర్ : ఎస్.తారకరామారావు.
పాఠశాల పేరు : జీహెచ్ఎస్, పాతపట్నం.




ప్రాజెక్టు పేరు: బయో డీగ్రేడబుల్ శానిటరీ నాప్‌కిన్స్ ఫ్రమ్ కార్న్ హస్క్ (పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కజొన్న తొక్కలతో శానిటరీ నాప్‌కిన్స్ తయారీ)
తయారు చేసిన విద్యార్థులు: ఐ.రోహన్, డి.జస్వర్దన్
గైడ్ టీచర్ : ఎస్.వీ.ఎస్.ఎల్. పూర్ణిమ.
పాఠశాల పేరు : జెడ్పీహెచ్ఎస్, మురపాక.

ఈనాడూ.. ఇదేం తీరు..!

నరసన్నపేట: సామాజిక సాధికార యాత్రకు సంబంధించి ఈనాడులో శనివారం ప్రచురించిన వార్తపై ప్రజలు నవ్వుకుంటున్నారు. బస్సు యాత్రకు స్పందన నిల్ అనే వార్తకు జత చేసిన నరసన్నపేట సభ ఫొటోపై ఇదేం జర్నలిజం అంటూ మండిపడుతున్నారు. బుధవారం నరసన్నపేటలో జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. అయినా వాస్తవాలను కప్పిపుచ్చి సభ ముగియడానికి కొన్ని నిమిషాల ముందు ఖాళీ కుర్చీలు కనిపించేలా ఫొటోలు తీసి సభకు జనాలు రాలేదని.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు వైఎస్సార్ సీపీ బస్సుయాత్రను పట్టించుకోవడం లేదని కథనం ప్రచురించడం పట్ల స్థానికులు తీవ్రంగా ఖండిస్తున్నారు.


ఈనాడులో వచ్చిన కథనం

వాస్తవాలను దాచి తప్పుడు ప్రచారం తగదని అంటున్నారు. సోషల్‌మీడియాలో ఈనాడు కథనాన్ని ఖండిస్తూ..అసలైన జనాల ఫొటో పెట్టి ఆంధ్రా ఫ్యాక్టు చెక్ బాబుకే కాదు ఈనాడు అధిపతికీ ఐ సర్జరీ అవసరమే అని పెట్టిన పోస్టు శనివారం స్థానికంగా బాగా వైరల్ అయింది.


నరసన్నపేటలో సభకు వచ్చిన జనం

'మతిభ్రమించి మాట్లాడుతున్న అచ్చెన్న'


చింతాడ మంజు

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మతిభ్రమించి ఏం మాట్లాడాలో తెలియక ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు అన్నారు. శనివారం ఆమె టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. నాలుగున్నరేళ్లగా నియోజకవర్గ ప్రజల్ని కనీసం పట్టించుకోని అచ్చెన్నాయుడు ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మీడియాలో కనిపించాలనే తపనతో అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ పాలనలో దేశం నేతలు మద్యం దోపిడీలకు పాల్పడి కోట్లాది రూపాయలు దోచుకున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుత ప్రభుత్వంలో మద్య నియంత్రణ చర్యలు చేపడుతున్నారని చెప్పారు.

ప్రభుత్వం దృష్టికి మాజీ సైనికుల సమస్యలు

- మంత్రి సీదిరి అప్పలరాజు


మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: మాజీ సైనికుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకునివెళ్తానని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గలోని మాజీ సైనికుల సంఘ భవనంలో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో మన ప్రాంతానికి సీఎం వచ్చి కిడ్నీ రీసెర్చ్ సెంటర్, వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు ప్రారంభించనున్నారని, మీరంతా కుటుంబాలతో సహా విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. మాజీ సైనికులకు జీవిత బీమా సదుపాయం, ఇళ్ల స్థలాలు అందించే విషయమై సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రజల కోసం పని చేస్తున్న జగనన్న ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఇళ్ల మన్మధరావు, ఉపాధ్యక్షుడు బంగారు బారికి, కోశాధికారి ఉప్పాడ వెంకటరావు, కార్యదర్శి అన్నెపు వైకుంఠరావు, సంయుక్త కార్యదర్శి ఎ.వి.రావు, ఐ.తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

జలుమూరు: మండలంలోని సుబ్రహ్మణ్యపురం పంచాయతీ, సారవకోట మండలం తొగిరి గ్రామం మధ్య తోటలో శనివారం సాయంత్రం పేకాట ఆడుతూ పట్టుబడిన 15 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.88,146 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

బాక్సింగ్ చాంపియన్‌గా శ్రీకాకుళం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం బాక్సింగ్ క్రీడాకారులు తొలిసారి చాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించారు. విశాఖపట్నంలోని పోర్ట్ స్టేడియంలో జరిగిన 7వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా నిలిచి టైటిల్‌ను సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.ఎ.లక్ష్మణ్ దేవ్ అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా బాక్సర్లు నాలుగు బంగారు, రెండు రజత, మరో ఐదు కాంస్య పతకాలు సాధించి సత్తాచాటారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీధర్ రావు పర్యవేక్షణలో బాక్సింగ్ కోచ్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న తీరును అభినందించారు. కార్యక్రమంలో బాక్సింగ్ సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి వంగా మహేష్, అసిస్టెంట్ కోచ్ రాజీవ్ పాల్గొన్నారు.

స్పందిస్తున్న దాతలు

సాక్షి ఎఫెక్ట్


గ్రామస్తులతో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: కిడ్నీలు పాడై విశాఖపట్నం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెంచల గోవిందరావుకు కిడ్నీమార్పిడికి అవసరమైన నిధుల సేకరణ జరుగుతోంది. దాతలే దిక్కు అన్న శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి పలువురు ముందుకు వస్తున్నారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ యలమంచిలి సర్పంచ్ మెండ రవికుమార్ గృహంలో గ్రామపెద్దలతో మాట్లాడారు. గోవిందరావు చికిత్స పొందుతున్న ఆసుపత్రి యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడారు. శస్త్రచికిత్సకు అవసరమైన సహాయం అందిస్తానని చెప్పారు. సర్పంచ్ మెండ రవికుమార్ అన్నదమ్ములు జగన్, రామ్‌లు సుమారు రూ.30 వేలు అందించారు. యలమంచిలికి చెందిన యూత్ పట్ట వెంకటేష్ బృందం రూ.1.60 లక్షలు సేకరించగా, హెల్పింగ్ హ్యాండ్స్ నుంచి రూ.37 వేలు అందించినట్లు సీహెచ్ శ్యామ్‌సుందరరావు తెలిపారు. మొత్తం ఇప్పటి వరకూ రూ.2.27 లక్షల నిధులు సేకరించినట్లు చెప్పారు.

నగరంపల్లి యువకుడికి ఇంటర్నేషనల్ అవార్డు



అవార్డుతో భానుప్రకాశ్



116 ఆర్టికల్స్‌తో అంబేద్కర్ చిత్రం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో నగరంపల్లి గ్రామానికి చెందిన యువకుడు శిష్టు భానుప్రకాశ్ తన ప్రతిభా నైపుణ్యంతో 'ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్' సొంతం చేసుకున్నాడు. భారత రాజ్యాంగంలోని 116 ఆర్టికల్స్‌తో అంబేడ్కర్ (బిగ్గెస్ట్ టైపోగ్రాఫీ పోర్టరైట్ ఆర్ట్స్) చిత్రాన్ని గీసినందుకు ఈ అవార్డు దక్కింది. డిప్లమా పూర్తి చేసి పోటీ పరీక్షలు సన్నద్ధమవుతూ చిత్రలేఖనం పట్ల ఆసక్తితో ఈ చిత్రాన్ని గీశారు. గిన్నిస్ రికార్డుతో సమానమైన ఈ అవార్డు దక్కడంతో తల్లిదండ్రులు భాగ్యలత నీలాచలం ఆనందం వ్యక్తం చేశారు. భానుప్రకాశ్‌ను పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, సర్పంచ్ పద్మావతి, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, యువకులు శనివారం అభినందించారు.

పరీక్షల్లో ఫెయిల్.. విద్యార్థిని ఆత్మహత్య


మృతురాలు ఝాన్సీ (ఫైల్ ఫొటో)

శ్రీకాకుళం క్రైమ్: పరీక్షల్లో అన్ని సబ్జెక్టులూ తప్పడంతో మనస్థాపం చెందిన శ్రీకాకుళం నగరంలోని దమ్మలవీధికి చెందిన ఎంబీఏ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. దమ్మలవీధిలో నివాసముంటున్న మండా రమణమ్మకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె పద్మలతకు వివాహమై ఇద్దరు పిల్లలుండగా, చిన్న కుమార్తె ఝాన్సీ (24) ఎచ్చెర్లలోని శివాని కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. పెద్ద కుమార్తె బీసీ హాస్టల్‌లో కుక్‌గా పనిచేస్తూ పిల్లలు, తల్లి రమణమ్మ, చెల్లెలు ఝాన్సీతో కలిసి అందరూ ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి శరంగడల్ వీధిలో అయ్యప్పస్వామి భజన వద్దకు తల్లీ, పెద్ద కుమార్తె వెళ్లారు. ఇంతలో ఝాన్సీ తలుపులు వేసుకుంది. పిల్లలు భయపడి పక్కింటి వారి ఫోన్ తీసుకుని తల్లికి విషయం చెప్పారు. వారు వచ్చి చూడగా ఫ్యాన్ హుక్‌కు చున్నీతో ఝాన్సీ వేలాడుతూ కనిపించింది. కిందకి దింపి చూసేసరికి ప్రాణం పోయింది. అక్కడే ఉన్న డ్రెస్సింగ్ టేబుల్‌పై సూసైడ్ నోట్ గుర్తించారు. 'అమ్మా.. ఫస్టియర్ ఫస్ట్ సెమ్‌లో ఫెయిలయ్యాను. ఫ్రెండ్స్ అందరూ పాసయ్యారు. రిజల్ట్ వచ్చి చాలా రోజులైంది. నేను ఫెయిలైనట్లు మీకు తెలిస్తే మిమ్మల్ని ఫేస్ చేయలేను. నామీద చాలా ఆశలు పెట్టుకున్నారు. నాకు భయమేస్తోంది. అందుకే చనిపోతున్నా.. సారీ..' అంటూ ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి ఆరా తీశారు. తమకు ఎవరిపై అనుమానం లేదని, ఎప్పుడూ సరదాగా ఉండే కుమార్తె ఈ ఘాతుకానికి పాల్పడుతుందని అనుకోలేదని తల్లి పోలీసుల వద్ద వాపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.